# వాస్తవం

డిజిటల్ పత్రిక

ఉన్నది ఉన్నట్లుగా

శనివారం
28.02.2026

డెయిలీ. కామ్

ఎడిటర్: ఎం.కృష్ణారెడ్డి


చిలుకూరు బాలాజీ టెంపుల్ ప్రధాన అర్చకులు

## సి.ఎస్. సౌందరరాజన్ కన్నుమూత



**హైదరాబాద్ :** రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు గ్రామంలో ఉన్న చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు, ఆలయ మేనేజింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ సౌందర రాజన్ శుక్రవారం పరమపదించారు. ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్టర్ గా పదవీ విరమణ పొందిన తరువాత ఆలయంలో ఉంటూ ఆలయ అభివృద్ధికి కృషి చేసిన ఆయన చిలు కూరు బాలాజీ ఆలయానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. వీసాల దేవుడిగా నామకరణం వచ్చే విధంగా కృషి చేశారు.

# ఢిల్లీ లిక్కర్ కేసు

## కేజ్రీవాల్‌కు క్లీన్ చిట్

ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు భారీ ఊరట లభించింది. సీబీఐ కోర్టు ఈ కేసునుంచి కేజ్రీవాల్‌ను డిశ్చార్జ్ చేసింది. శుక్రవారం ఢిల్లీ మద్యం పాలసీ కేసుపై ది రౌస్ అవెన్యూ కోర్టు విచారణ జరిపింది. సీబీఐ వేసిన చార్జ్‌షీట్‌లో మెరిట్ లేదని కోర్టు పేర్కొంది. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌తో పాటు ఉప ముఖ్యమంత్రి సిసోడియాకు కూడా క్లీన్‌చిట్ ఇచ్చింది. కవితతో పాటు 23 మంది నిందితులు తప్పు చేసినట్టు సాక్ష్యాధారాలు లేవని కోర్టు స్పష్టం చేసింది. అందరికీ క్లీన్ చిట్ ఇచ్చింది. అయితే, రౌస్ అవెన్యూ కోర్టు తీర్పును సీబీఐ సవాల్ చేయనుంది.

- కవితతో సహా 23 మంది నిందితులను విముక్తులను చేసిన రౌస్ అవెన్యూ కోర్టు
- దిగువ కోర్టు తీర్పుపై హైకోర్టులో సీబీఐ పిటిషన్
- మోదీ, హోం మంత్రి అమిత్‌షా కుట్ర
- ఢిల్లీలో మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి
- పదికి పైగా సీట్లను బీజేపీ గెలిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా
- ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ సవాల్

**న్యూఢిల్లీ:** ఢిల్లీ మద్యం పాలసీ కేసు మలుపులు తిరుగుతోంది. ఈ కేసులో ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా మరో 21 మంది నిందితులకు రౌస్ అవెన్యూ కోర్టు శుక్రవారంనాడు క్లీన్ చిట్ ఇచ్చింది. కేసు నుంచి వారిని విముక్తులను చేసింది. అయితే దీనిపై వెంటనే సీబీఐ చర్యలకు దిగింది. దిగువ కోర్టు ఉత్తర్వులను సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్ వేసింది. తక్షణం పిటిషన్‌పై విచారణ జరపాలని కోర్టును కోరింది. ఈ కేసులో రౌస్ ఎవెన్యూ కోర్టు శుక్రవారంనాడు కీలక తీర్పు ఇచ్చింది. సీబీఐ చార్జిషీటులో మెరిట్ లేదని పేర్కొంది. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, ఉప ముఖ్యమంత్రి సిసోడియా తదితరులకు క్లీన్‌చిట్ ఇచ్చింది. వీరు తప్పు చేసినట్టు సాక్ష్యాధారాలు లేవని కోర్టు స్పష్టం చేసింది. కేసు నుంచి నిందితులకు విముక్తి కల్పించింది. సత్యం సాధించిన చారిత్రక విజయంగా ఈ తీర్పును 'ఆప్' అభివర్ణించింది. తీర్పు అనంతరం భావోద్వేగానికి గురైన అరవింద్ కేజ్రీవాల్.. ఆప్‌ను అంతం చేసేందుకు తప్పుడు మద్యం కుంభకోణం పేరుతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షా కుట్ర పన్నారని, తన ప్రతిష్టపై దాడి చేశారని ఆరోపించారు. ఢిల్లీలో మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని ప్రధానమంత్రికి సవాలు విసిరారు. పదికి పైగా సీట్లను బీజేపీ గెలిస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని అన్నారు.




### కవిత నిర్దోషి
### ఢిల్లీ మద్యం కేసులో సీబీఐ ప్రత్యేక కోర్టు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27 :** ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఐదున్నర నెలలపాటు తిహాడ్ జైలులో ఉన్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత పూర్తిగా నిర్దోషి అని రౌస్ అవెన్యూలోని సీబీఐ ప్రత్యేక కోర్టు స్పష్టం చేసింది. ఈ మద్యం కుంభకోణంలో నిందితులైన వారిని కవితతో సహా సౌత్ గ్రూపుగా సీబీఐ అభివర్ణించడాన్ని కోర్టు తీవ్రంగా పరిగణించింది. సౌత్ గ్రూపునకు చెందిన కొందరు మద్యం వ్యాపారులకు ప్రయోజనం చేకూర్చేందుకే విధానాన్ని రూపొందించారన్న ఆరోపణల్లో పసలేదని పేర్కొంది.

### బీఆర్ఎస్ ఓటమిని నా మెడలో వేస్తారా?
#### ఎన్నికల్లో పార్టీ ఓడింది అహంకారం వల్లే

**కొత్త పార్టీ పెట్టే సమయంలో దేవుడి ఆశీర్వాదంలా తీర్పు**

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమిని తన మెడలో వేస్తారా ? అంటూ తన సోదరుడు కేటీఆర్‌తోపాటు బీఆర్ఎస్ శ్రేణులపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. అహంకారం వల్లే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయిందని, ఈ విషయాన్ని పార్టీ సమావేశాల్లో చర్చించలేదా ? అంటూ ఆమె ప్రశ్నించారు. మద్యం కుంభకోణం కేసులో కోర్టు ఇచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం ఎక్స్‌లో ఓ పోస్టు చేశారు. తాను రెండు నెలల్లో కొత్తపార్టీ పెట్టబోతున్నానని, ఈ సమయంలో కోర్టు ఇచ్చిన సానుకూల తీర్పును దేవుడి ఆశీర్వాదంగా భావిస్తున్నానని కవిత తెలిపారు. మద్యం కుంభకోణం కేసు అక్రమంగా పెట్టారనే విషయాన్ని నిర్ధారిస్తూ. కేసును పూర్తిగా పక్కనపెడుతూ కోర్టు అందరినీ నిర్దోషులుగా విడుదల చేసిందని అన్నారు. ఈ తీర్పు న్యాయవ్యవస్థపై తాము పెట్టుకున్న నమ్మకాన్ని కాపాడిందని కవిత తెలిపారు. దేశంలో జరుగుతున్న రాజకీయ ప్రతీకార చర్యల్లో భాగంగా పెట్టిన ఈ కేసులో నుంచి కడిగిన ముత్యంలా బయటకు వస్తానని తాను ముందు నుంచి చెబుతున్నట్టుగానే కోర్టు తీర్పు వచ్చిందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కేసు పెట్టిన సందర్భంలో తనకు, తన కుటుంబానికి అండగా నిలిచిన జాగృతి నాయకులు, కార్యకర్తలకు కవిత ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు. తాను కారాగారంలో ఉన్న సమయంలో తన పిల్లలకు అండగా నిలిచిన తన తల్లిదండ్రులు, అత్తమామలు, తన భర్త అనిల్‌కు కూడా కవిత కృతజ్ఞతలు తెలిపారు. ఈ కేసు వల్ల తన భర్త, పిల్లలు అయిదున్నర నెలలు నరకయాతన అనుభవించారని, అది వారిని మంచి మనుషులుగా తయారు చేసిందన్నారు.

ఇది ప్రభుత్వం కాదు..

## రియల్ ఎస్టేట్ కంపెనీ

### వాళ్లు రియల్ ఎస్టేట్ బ్రోకర్లు : కేటీఆర్



**ఖమ్మం:** ఖమ్మం జిల్లాలోని భూదాన్ భూముల్లో ఇండ్లపైకి బుల్డోజర్లు పంపించి కూల్చివేయడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వెయ్యి కోట్ల రూపాయలను గాంధీ కుటుంబానికి పంపుతానని సీఎం రేవంత్ రెడ్డి ప్రామిస్ చేశాడని.. అందుకే పేదల ఇళ్లు కూల్చి, భూములు అమ్మి డబ్బులు రెడీ చేయాలని చూస్తున్నాడని ఆరోపించారు. పేదల ఇండ్లు కూలగొడుతూ.. హైదరాబాద్‌లో తన రెండో ప్యాలెస్ కట్టుకుంటున్నాడని విమర్శించారు. పేదల ఇండ్లు పెకిలించి వేస్తూ.. మరో పక్క తన కోటకు గోడలు కట్టడానికే కేవలం తొమ్మిది కోట్లు ఖర్చు చేస్తున్నాడని ముఖ్యమంత్రిపై కేటీఆర్ మండిపడ్డారు. భట్టి విక్రమార్క మూడో ఇంటిని కట్టుకుంటున్నాడని.. పొంగులేటి పదో కంపెనీ పెట్టి కమీషన్లు వెనకేసుకుంటున్నాని విమర్శించారు. పేదల జీవితాలను మాత్రం రోడ్డున పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ప్రభుత్వం కాదు, రియల్ ఎస్టేట్ కంపెనీ.. వీళ్ళు మంత్రులు కాదు రియల్ ఎస్టేట్ బ్రోకర్లు అని విమర్శించారు.

### కౌంటింగ్ పూర్తయిన వారం వరకు
## వీవీప్యాట్ లెక్కింపునకు అవకాశం..

#### సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెల్లడి



**న్యూఢిల్లీ:** ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయిన తర్వాత కూడా అభ్యర్థులు ఎవరికైనా ఫలితాలపై అనుమానాలు ఉంటే వాటిని నివృత్తి చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని ఎన్నికల కమిషన్ తాజాగా నిర్ణయించింది. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయిన 7 రోజుల వరకు ఈవీఎంలో నమోదైన ఓట్లతో వీవీ ప్యాట్ల ను సరిచూసుకునేందుకు అనుమతి ఇస్తున్నట్లు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెల్లడించారు. అభ్యర్థులు తగిన రుసుము చెల్లించి వీవీప్యాట్‌తో ఈవీఎంలో నమోదైన ఓట్లను సరిచూసుకో వచ్చని ఆయన చెప్పారు. శుక్రవారం చెన్నైలో విలేకరుల సమావేశంలో సీఈసీ మాట్లాడుతూ కొత్తగా తీసుకున్న నిర్ణ యాల్లో మరో ప్రధాన నిర్ణయం ఈవీఎం కౌంటింగ్ ప్రారంభం కావడానికి 2 రౌండ్ల ముందు పోస్టల్ బ్యాలట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని చెప్పారు. తమిళ నాడులో ఇటీవల ముగిసిన సర్ ప్రక్రి య విజయవంతమైందని, ఇది దేశానికే ఆదర్శమని సీఈసీ చెప్పారు. ఒకే దశలో అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించాలని తమిళనాడులోని రాజకీయ పార్టీలు సూచించాయని, అన్ని అంశాలను పరిశీలించిన తర్వాత తగిన నిర్ణయం తీసుకుంటామని ఆయన చెప్పారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తర్వాత ఎన్ని దశల్లో ఎన్నికలను ఈసీ నిర్వహిస్తుందో తెలుస్తుందని ఆయన వివరించారు.

## డీఎంకేలో చేరిన పన్నీర్ సెల్వం



**చెన్నై, ఫిబ్రవరి 27 :** తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, ఏఐఏడీఎంకే బహిష్కృత నేత ఓ పన్నీర్‌సెల్వం శుక్రవారం అధికార డీఎంకే పార్టీలో చేరారు. అసెంబ్లీ ఎన్నికల ముందు జరిగిన ఈ చేరిక తమిళనాడు రాజకీయాల్లో కీలక మలుపుగా భావిస్తున్నారు. మాజీ సీఎం, ఏఐఏడీఎంకే చీఫ్ జయలలిత విధేయుడైన పన్నీర్‌సెల్వంను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆహ్వానించి అధికారికంగా తమ పార్టీలో చేర్చుకున్నారు. ఏఐడీఎంకే నేత ఈ పళనిస్వామి అహంకార వైఖరి కారణంగా ఆ పార్టీ ఎన్నికల్లో గెలువలేని స్థితిలో ఉందని పన్నీర్‌సెల్వం ఈ సందర్భంగా పేర్కొన్నారు. అతను నిరంకుశ విధానాలతో పార్టీని నడుపుతున్నారని ఆరోపించారు.

### రేసు రసవత్తరం..
## న్యూజిలాండ్‌కు షాకిచ్చిన ఇంగ్లండ్

#### ఉత్కంఠ పోరులో కివీస్ ఓటమి పోటీలోనే పాక్!

**కొలంబో:** టీ20 ప్రపంచకప్‌లో గ్రూప్-1 మాదిరిగానే గ్రూప్-2లోనూ సెమీస్ రేసు రసవత్తరంగా మారింది. ఇంగ్లండ్‌తో కొలంబోలో జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్‌కు అనూహ్య షాక్ తగిలింది. అభిమానులను అలరించిన మరో 'లో స్కోరింగ్ థ్రిల్లర్'లో ఇంగ్లండ్‌దే పైచేయి అయింది. బ్రూక్ సేన.. 4 వికెట్ల తేడాతో కివీస్‌ను చిత్తు చేసి సెమీస్ రేసును ఉత్కంఠగా మార్చింది. న్యూజిలాండ్ నిర్దేశించిన 160 పరుగుల ఛేదనను ఆ జట్టు 19.3 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి పూర్తిచేసింది. టామ్ బ్యాంటన్ (24 బంతుల్లో 33, 3 ఫోర్లు, 1 సిక్స్), 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' విల్ జాక్స్ (18 బంతుల్లో 32 నాటౌట్, 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్.. ఇంగ్లిష్ బౌలర్లు కట్టడి చేయడంతో నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 159 రన్స్ చేసింది. గ్లెన్ ఫిలిప్స్ (28 బంతుల్లో 39, 4 ఫోర్లు, 1 సిక్స్), టిమ్ సీఫర్ట్ (25 బంతుల్లో 35, 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఫర్వాలేదనిపించారు. ఛేదనలో ఇంగ్లండ్ ఇన్నింగ్స్ కూడా తడబాటుకు గురైంది. హెన్రీ తొలి ఓవర్లోనే సాల్ట్ (2)ను బోల్తా కొట్టించగా ఫెర్గ్యూసన్.. ఫామ్‌లో లేని బట్లర్‌ను డకౌట్ చేశాడు. ఈ క్రమంలో గత మ్యాచ్ శతక హీరో కెప్టెన్ హ్యారీ బ్రూక్ (24 బంతుల్లో 26, 3 ఫోర్లు, 1 సిక్స్) కివీస్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. బెతెల్ (16 బంతుల్లో 21, 4 ఫోర్లు)తో కలిసి మూడో వికెట్‌కు 48 రన్స్ జతచేశాడు. అయితే 8వ ఓవర్లో బౌలింగ్‌కు వచ్చిన ఫిలిప్స్.. బ్రూక్‌ను వెనక్కి పంపగా రచిన్ ఓవర్లో బెతెల్ పెవిలియన్ చేరాడు. కానీ కరన్, బ్యాంటన్ ఇంగ్లండ్‌ను ఆదుకున్నారు. ఐదో వికెట్‌కు ఈ జోడీ 42 రన్స్ జోడించి ఆ జట్టును పోటీలోకి తెచ్చింది. కానీ డ్రింక్స్ విరామం తర్వాత రచిన్ వరుస ఓవర్లలో కరన్, బ్యాంటన్‌నూ ఔట్ చేసినా కివీస్‌కు ఆ ఆనందం ఎక్కువసేపు దక్కలేదు. ఫిలిప్స్ ఓవర్లో జాక్స్.. 6, 4, 4తో 22



రన్స్ రాబట్టడంతో మ్యాచ్ ఇంగ్లండ్ వైపు మళ్లింది. ఆఖరి రెండు ఓవర్లలో ఆ జట్టు విజయానికి 21 పరుగులు అవసరమవగా శాంట్నర్ 19వ ఓవరోనూ 16 రన్స్ వచ్చాయి. చివరి ఓవర్లో జాక్స్ బౌండరీ కొట్టి లాంఛనాన్ని పూర్తి చేశాడు.

# డ్రైవర్లు రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలి

**జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే**

వాస్తవం : ఎల్లారెడ్డిపేట



రోడ్డు ప్రమాదాల నివారణే ప్రధాన లక్ష్యంగా చేపట్టిన “అరైవ్ అలైవ్” కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎల్లారెడ్డిపేట పోలీసుల ఆధ్వర్యంలో, అశ్విని దవఖాన సహకారంతో మండల పరిధిలోని వివిధ వాహనాల డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే శిబిరాన్ని ప్రారంభించి, అవసరమైన డ్రైవర్లకు ఉచిత కళ్లద్దాలు, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, డ్రైవర్ల భద్రతే ప్రజల భద్రత అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యత తో వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాల నివారణ కు కృషి చేయాలని సూచించారు. ప్రతి వాహనాదారుడు సామాజిక బాధ్యతగా రోడ్డు భద్రతా, ట్రాఫిక్ నియమాలు తప్పక పాటించాలని తెలిపారు. దీర్ఘకాలం వాహనాలు నడిపే డ్రైవర్లు కంటి చూపు సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా నిరంతరం పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. స్పష్టమైన చూపు లేకపోవడం కూడా రోడ్డు ప్రమాదాలకు కారణమవుతుందని హెచ్చరించారు. వాహనం నడిపేటప్పుడు ట్రాఫిక్ మరియు రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలని, ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని చెప్పారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, ఓవర్ స్పీడ్, ఓవర్ లోడింగ్, ర్యాష్ డ్రైవింగ్, సెల్ ఫోన్ ఉపయోగించడం వంటి నిబంధనల ఉల్లంఘనపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దూర ప్రయాణాలు చేసే డ్రైవర్లు అలసటగా ఉన్నప్పుడు వాహనాన్ని పక్కన ఆపి విశ్రాంతి తీసుకోవాలని, ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, అన్ని మండల కేంద్రాల్లో డ్రైవర్ల కోసం ఉచిత కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ అశ్విని హాస్పిటల్ యాజమాన్యానికి, డాక్టర్ అభినయ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ నాగేంద్రచారి, సి.ఐ శ్రీనివాస్, ఎస్.ఐలు రాహుల్ రెడ్డి, లక్ష్మణ్, సిబ్బంది మరియు వాహనాల డ్రైవర్లు పాల్గొన్నారు.

### సి ఆర్ పీ యఫ్ 141 బెటలియాన్ సహకారంతో

# పినాయిల్ తయారీ శిక్షణ

చర్ల : వాస్తవం



చర్ల మండల కేంద్రం లోని స్థానిక రాహుల్ విజ్ఞాన్ విద్యాలయం లో శుక్రవారం రాహుల్ హై స్కూల్ విద్యార్థులకు కేంద్ర రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్ పీయఫ్) 141 బెటాలియన్ వారి సివిక్ యాక్షన్ ప్రోగ్రాం లో భాగంగా కమాండెంట్ రితీష్ కుమార్ ఠాకూర్ ఆదేశాల మేరకుఇన్స్పెక్టర్ మనీష్ కుమార్ ఆధ్వర్యం లో రాహుల్ విద్యార్థులకు ఫినాయిల్ తయారీ శిక్షణా కార్యక్రమాన్ని కళాభవన్ లో నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమం లోఅతి తక్కువ పెట్టుబడితో ఇంట్లోనే ఫినాయిల్ తయారు చేసే విధానాన్ని నిపుణులు ప్రత్యక్షంగా వివరించారు. వైట్ ఫినాయిల్ తయారీకి కావాల్సిన రసాయనాలను, నాణ్యతను పెంచే పద్ధతులు మరియు మార్కెటింగ్ నైపుణ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం సీ ఆర్ పియఫ్ అధికారులు మాట్లాడుతూ సీ ఆర్ పీ యఫ్ కేవలం భద్రతకే పరిమితం కాకుండా, ప్రజల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి కోసం ఇలాంటి సివిక్ యాక్షన్ ప్రోగ్రామ్‌లను నిరంతరం నిర్వహిస్తుందని తెలిపారు. రాహుల్ విజ్ఞాన్ విద్యాలయం వారు ఈ శిక్షణ కార్యక్రమానికి సహకారం అందించడం పట్ల ప్రిన్సిపాల్ వర్మరాజు కు ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్ పియఫ్ అధికారులు, శిక్షకులు శంకర రావు ,రాహుల్ విజ్ఞాన్ విద్యాలయం డైరెక్టర్ కొసరాజు హరిచరణ్, ఉపాధ్యాయులు బిట్రగుంట క్రాంతి కుమార్, యస్కె ఉస్మాన్, శెట్టి సునీత, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

### ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని

# జిల్లా కలెక్టర్ తనిఖీ



వాస్తవం : వేములవాడ

వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల లో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్ష కేంద్రం లో శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు,కనీస వసతుల కల్పనను పరిశీలించి,అధికారులతో మాట్లాడారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ జయంత్ కుమార్, అధ్యాపకులు,సిబ్బంది ఉన్నారు.

### కునారం రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి (ఆర్.ఓ.బి)

## అప్రోచ్ రోడ్డు పనులు వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



పెద్దపల్లి : వాస్తవం

శుక్రవారం జిల్లా కలెక్టర్ పెద్దపల్లి కూనారం రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,పెద్దపల్లి కూనారం ఆర్.ఓ.బి బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ ప్రక్రియ పూర్తి చేసి సంబంధిత శాఖకు బదలాయించామని,అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు పట్టిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు విడుదలైన నేపథ్యం లో రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలని అన్నారు. అండర్ పాస్ పనులు నెల రోజుల లోపు పూర్తి చేయాలని,ఆర్.ఓ.బి పూర్తయ్యే లోపు అప్రోచ్ రోడ్డును కూడా పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకుని రావాలని రైల్వే శాఖ అధికారులను,ఆర్ అండ్ బి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఈ ఆర్ అండ్ బి భావ్ సింగ్, పెద్దపల్లి ఆర్డిఓ బి.గంగయ్య,సంబంధిత అధికారులు ,తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి 50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

**నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలి : పీక కిరణ్**

వాస్తవం : కాటారం



నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో కుల దురహంకారానికి రెండేళ్ల పసిబిడ్డ బలికావడం అత్యంత దారుణమని తెలంగాణ ప్రజా ఫ్రంట్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం కాటారంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబానికి తక్షణ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కులం పేరుతో దాడి చేసి చిన్నారి మృతికి కారణమైన నిందితులపై హత్య కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని, ఘటనపై న్యాయ విచారణ జరిపించాలని కోరారు. బాధిత కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. పోలీసులు బాధితులకు న్యాయం చేయాల్సింది పోయి కేసును తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన విమర్శించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ అసంఘటిత కార్మిక సంఘాల రాష్ట్ర కార్యదర్శి ఐత బాపు, తెలంగాణ రైతు పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ దాసరి రమేష్, టీపీఎఫ్ జిల్లా నాయకులు దారకొండ సూర్యశంకర్, వెంకటేశ్వర్లు, నామాల శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్‌పై అవగాహన

వ్యవసాయ విస్తరణ అధికారి బి శశిధర్

వాస్తవం : రామగుండం రూరల్



పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం బామ్లు నాయక్ తండ గ్రామంలో గ్రామ సర్పంచ్ అఖిల– అంజి నాయక్ అధ్యక్షతన జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ పైన అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బాదావత్ అఖిల– అంజి నాయక్ మాట్లాడుతూ మన గ్రామ రైతులకు మన పంట పొలాలలో సేంద్రియ ఎరువులు వాడుకొని ఆర్గానిక్ పంటలను పండించాలని మనం వరి పొలాలు కావచ్చు ,మొక్క జొన్న,పతి కావచ్చు సరైన టైంలో వేసి సరైన సమయంలో పంటకు మందులు వాడాలని తెలిపారు. అనంతరం వ్యవసాయ విస్తరణ అధికారి ప్రజలకు జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ పైన రైతులకు ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఏ పంట ఏ కాలంలో వేయాలో, ఏ పంటకు ఏ మందులు వాడాలో, మందు లు ఏ సమయంలో వాడాలో రైతులకు అవగాహన కల్పించారు. అలాగే రైతులకు వ్యవసాయపరంగా ఉన్న సమస్యలను తెలుసుకొని వాటిపై అవగాహన కూడా చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో చర్చించిన అంశాలు బీజామృతం తయారీ,జీవామృతం కాశ యాల తయారీ, సస్యరక్షణకై వేప నూనె వాడకం, అంతర పంటలు, రక్షక పంటలు, పచ్చి రొట్ట ఎరువులు, జీవన ఎరువులు, జీవ శిలీంధ్ర నాశనలు, దేశవాలి జాతులైన గిర్, ఒంగోలు, సాహివాల్, ఆవుల పెంపకం పైన రైతులకు అవగాహన కల్పించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాదావత్ అఖిల– అంజి నాయక్, వ్యవసాయ విస్తరణ అధికారి బి శశిధర్, వార్డు సభ్యులు బాదావత్ యమున,ఇస్లావత్ రాజేష్,పంచాయతీ కార్యదర్శి అనిల్,గ్రామ రైతులు,ప్రజలు,యువకులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

ఎంపీడీవో రాజేష్ కుమార్



వాస్తవం : అందోల్

గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని ఆందోల్ ఎంపీడీవో రాజేష్ కుమార్ అన్నారు. వార్డు సభ్యుల శిక్షణ పూర్తి అయిన సందర్భంగా ఆయన వారితో మాట్లాడుతూ,ఇన్ని రోజులు శిక్షణ కార్యక్రమంలో మౌలిక సదుపాయాల గురించి తెలుసుకున్నారని అలాంటివన్నీ పరిశీలించి పరిష్కరించాలని అప్పుడు గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఆయన పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకు నందున సమస్యలు పరిష్కారం సులభవుతా యన్నారు. అలాగే శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల వార్డ్ సభ్యులు అధికారులు పాల్గొన్నారు.

# కేసిరెడ్డి లావణ్య నరసింహారెడ్డికి ఘన సన్మానం

శంకరపట్నం : వాస్తవం

హుజురాబాద్ పట్టణంలో ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికలలో 26వ వార్డు కౌన్సిలర్‌గా గెలుపొందిన కేసిరెడ్డి లావణ్య నరసింహారెడ్డి దంపతులను బీసీ జేఏసీ హుజురాబాద్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ గౌరవాధ్యక్షులు చందుపట్ల జనార్దన్ మాట్లాడుతూ కేసిరెడ్డి దంపతులు హ్యాట్రిక్ విజయాన్ని అధిగమించి వరుసగా నాలుగవసారి కౌన్సిలర్ గా ఘన విజయాన్ని సాధించి చరిత్రను సృష్టించడంతోపాటు 26వ వార్డు ప్రజల హృదయములో సుస్థిర స్థానాన్ని దక్కించుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తాము ఇంతకుముందు సాధించిన అభివృద్ధికి తోడుగా వార్డులోని ప్రజలందరికీ తోడునీడగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారంతోపాటు వార్డ్ అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని కోరినారు. అంతేకాకుండా తమ సుదీర్ఘ రాజకీయ అనుభవాన్ని ఉపయోగించి హుజురాబాద్ పట్టణ అభివృద్ధికి పునాదిగా ఉండే విధంగా పనిచేస్తూ ఒక ఉత్తమమైన కౌన్సిలర్ గా ఎదిగి 26వ వార్డు ప్రజలతో పాటు హుజురాబాద్ పట్టణ ప్రజల మనసును దోచుకోవాలని ఆకాంక్షించినారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ అధ్యక్షుడు సందేల వెంకన్న, ప్రధాన కార్యదర్శి ఇప్పకాయల సాగర్, ఉప సర్పంచుల ఫోరం హుజురాబాద్ మండలం కన్వీనర్ వన్నాల శివాజీ, చీకట్ల సమ్మయ్య, బొద్దు అయిలయ్య, రమేష్, ప్రవీణ్ కుమార్, కొలిపాక క్రాంతి తదితరులు పాల్గొన్నారు.



# విద్యా కమిషన్ నివేదిక సిఫార్సులు అశాస్త్రీయం

డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా శాఖ

వాస్తవం : చందుర్తి



తెలంగాణ విద్యా కమిషన్ నివేదిక సిఫార్సులు అశాస్త్రీయమైనవనిడిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వైద్యుల రాజిరెడ్డి వెల్లడించారు. తెలంగాణ విద్యా కమిషన్ గురువారం ఎంతో ఆర్భాటంగా వెలువరించిన నివేదికలో ఇచ్చిన సిఫార్సులు చాలా అశాస్త్రీయ మైనవిగా ఉన్నాయని వైద్యుల రాజిరెడ్డి ఆక్షేపించారు. డిటిఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ అత్యవసర సమావేశం చందుర్తి మండలం ఎన్గల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం సాయంత్రం డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆవురం సుధాకర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా డిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వైద్యుల రాజిరెడ్డి హాజరయ్యారు. ప్రత్యేక అతిథులుగా డిటిఎఫ్ రాష్ట్రపూర్వ అధ్యక్షులు కె నారాయణరెడ్డి, ఎం రఘుశంకర్ రెడ్డి, రాష్ట్ర డిటిఎఫ్ ఆడిట్ కమిటీ సభ్యులు బి సదానందం హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డిటిఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వైద్యుల రాజిరెడ్డి ప్రసంగిస్తూ... విద్యా కమిషన్ గ్రామీణ వాస్తవ పరిస్థితులను గణనలోకి తీసుకోకుండా విద్యావేత్తల, ఉపాధ్యాయ సంఘాల సూచనలను పరిగణనలోకి తీసుకోకుండా రాష్ట్రవ్యాప్తంగా వేలాదిగా ఉన్న పాఠశాలను కుదిస్తూ మండలంలో నాలుగు ఫౌండేషన్ స్కూల్లో, మూడు పబ్లిక్ స్కూల్లో ఏర్పాటు చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా మొత్తంగా 4284 పాఠశాలలు మాత్రమే ఉనికిలో ఉండే విధంగా చేయడం సరైంది కాదని, విద్య ను కేంద్రీకరణ చేయడం వాంఛనీయం కాదని రాజిరెడ్డి ఉద్ఘాటించారు. డిటిఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు ఎం రఘు శంకర్ రెడ్డి ప్రసంగిస్తూ ...విద్యా కమిషన్ చేసిన సిఫారసులు ప్రభుత్వ పాఠశాలను కుదించి ప్రైవేటు విద్యను ప్రోత్సహించేలా ఉందని తెలిపారు. డిటిఎఫ్ రాష్ట్ర మరో పూర్వ అధ్యక్షులు కె నారాయణరెడ్డి ప్రసంగిస్తూ..విద్యకు 18 శాతం నిధులు కేటాయించాలని సిఫారసులను ఆహ్వానిస్తున్నానని, కొఠారి కమిషన్ సిఫారసుల ప్రకారం రాష్ట్ర వార్షిక బడ్జెట్లో 30 శాతం నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. డిటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు బూరె సదానందం మాట్లాడుతూ... ప్రైవేటు విద్యను అదుపు చేస్తూ ప్రతి గ్రామంలో ఒక ప్రభుత్వ పాఠశాల ఉండాలని కోరారు. ఈ సమావేశంలో డిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వంగ తిరుపతి, జిల్లా పూర్వ అధ్యక్షులు ఏ రాజేశ్వరరావు, పూర్వ ప్రధాన కార్యదర్శి చకినాల దేవేందర్,పూర్వాధ్యక్షులు దొంతుల శ్రీహరి,జిల్లా ఉపాధ్యక్షులు ఎండి సల్లావుద్దీన్,టి సురేష్, జిల్లా బాధ్యులు వెంకట రమణారెడ్డి,పిరాజేశ్వరరావు, జి సురేష్,ఎం మహేష్, ఎం చక్రపాణి,ఎస్ జలంధర్ రెడ్డి,బి రాజు,ఈగ శ్రీనివాస్,జి శ్రీనివాస్,వి పరుశురాములు,కె శ్రీధర్,ఏ శంకర్,జి వేణుగోపాల్,కె జనార్ధన్, జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

# రహదారి భద్రతపై అవగాహన పెంపొందించుకోవాలి

మండల విద్యాధికారి ఎన్ శంకర్

వాస్తవం : సంగారెడ్డి





సదాశివపేట మండలం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆత్మకూర్‌లో విద్యార్థుల భద్రత, రహదారి భద్రతపై అవగాహన పెంపొందించుటకు "అరైవ్-అలైవ్"కార్యక్రమాన్ని స్థానిక సీఐ డి.వెంకటేష్ నిర్వహించడం జరిగిందని మండల విద్యా అధికారి ఎన్ శంకర్ తెలియజేశారు.ఈ కార్యక్రమం ముందుగా సర్కిల్ ఇన్స్పెక్టర్ డి.వెంకటేష్ మాట్లాడుతూ విద్యార్థులకు రహదారి నియమాలు, హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్ వినియోగం, ట్రాఫిక్ సంకేతాల ప్రాముఖ్యత, జాగ్రత్తగా ప్రయాణించే విధానాలు వంటి అంశాలపై అవగాహన, అదనంగా, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక చర్చలు,ప్రసంగాలు,పోస్టర్ ప్రదర్శనలు మరియు ప్రమాణ స్వీకార కార్యక్రమాలు నిర్వహించబడతాయని,విద్యార్థులు సురక్షితంగా ప్రయాణించడం ప్రతి ఒక్కరి బాధ్యత.చిన్న వయస్సులోనే రహదారి భద్రతపై అవగాహన పెంపొందితే భవిష్యత్తులో ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చు"అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్ కృష్ణయ్య,ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు రామకోటయ్య,టీచర్స్,సీఆర్పి రాజేశ్వర్ మరియు విద్యార్థులు పాల్గొనాలని మండల విద్యాధికారి ఎన్.శంకర్ తెలిపారు.

# అమీన్‌పూర్‌లో ప్రభుత్వ భూముల కబ్జా

ప్రభుత్వ భూములను కాపాడాలి

తహసీల్దార్‌కు వినతి పత్రం అందించిన మాజీ వైస్ ఎంపీపీ, మాజీ వార్డు సభ్యులు

వాస్తవం : సంగారెడ్డి జిల్లా ప్రతినిధి




పటాన్చెరు నియోజకవర్గం అమీన్‌పూర్ జీహెచ్ఎంసీ సర్కిల్ పరిధిలోని అత్యంత విలువైన ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి కాపాడాలని కోరుతూ మాజీ వైస్ ఎంపీపీ కోకల శ్రీనివాస్ నేతృత్వంలో తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. అధికారులు సానుకూలంగా స్పందించి, ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని కోరారు. బీరంగూడలోని ప్రసిద్ధ శంభునిగుడి సమీపంలోని సర్వే నంబర్ 783లో సుమారు 20 గుంటలు, అలాగే సర్వే నంబర్ 767లో సుమారు 3 గుంటల ప్రభుత్వ భూమి ఉందని గ్రామస్తులు పేర్కొన్నారు.ఈ భూమిని కొంత మంది వ్యక్తులు అక్రమంగా ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారని,ఇప్పటికే అక్కడ ఆక్రమణలు బహిరంగంగా కనిపిస్తున్నాయని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ భూమిని కాపాడకపోతే భవిష్యత్తులో ప్రజా ప్రయోజనాల కోసం, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలకు స్థలం కొరత ఏర్పడుతుందని వినతిపత్రంలో వారు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత సర్వే అధికారులతో సదరు సర్వే నంబర్లలో సమగ్ర సర్వే నిర్వహించాలని కోరారు.ప్రభుత్వ భూమికి స్పష్టమైన హద్దులను ఏర్పాటు చేయాలని,అక్రమణలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.వినతిపత్రం అందజేసిన మాజీ వార్డు సభ్యులు సిహెచ్ లింగం గౌడ్, పట్లోళ్ల భాస్కర్ రెడ్డి, అమీన్ పూర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

# పాఠశాలలో మైనర్ విద్యార్థినిపై మానసిక వేధింపులపై విచారణ

సిడిపిఓ అలేఖ్య పటేల్

వాస్తవం : రామగుండం రూరల్



రామగుండం మండలం రావు శ్రీ అక్షర స్కూల్‌లో వైస్ ప్రిన్సిపల్ ఒక మైనర్ విద్యార్థినిని మానసికంగా వేధిస్తున్నారని ఆరోపిస్తూ ఎంఈఓ, డీఈఓ సంబంధిత అధికారులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు.కాగా సీబీఎస్ఈ క్యాంపస్‌కు ఇది వర్తించదు అన్న విధంగా స్పందన రావడంతో బాధిత కుటుంబ సభ్యులు జిల్లా బాలల సంరక్షణ విభాగానికి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన జిల్లా బాలల సంరక్షణ శాఖ అధికారులు స్కూల్‌కు చేరుకుని విద్యార్థులతో ప్రత్యేకంగా విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు వారి అభిప్రాయాన్ని తెలియజేస్తూ వైస్ ప్రిన్సిపల్ తమపై మానసిక వేధింపులకుగురిచేస్తున్నారని, అనుచితంగా ప్రవర్తిస్తున్నారని వెల్లడించినట్లు సమాచారం.ఈ సమాచారం మేరకు జిల్లా బాలల సంరక్షణ అదనపు ఆఫీసర్ వేణుగోపాల్ ఆదేశాల మేరకు సీడిపీఓ అలేఖ్య పటేల్, సూపర్వైజర్లు షేరీన్, మమత, కనకరాజు విచారణలో పాల్గొన్నారు.

# ఉపాధి పనులను పరిశీలించిన అడిషనల్ పిడి

వాస్తవం : మద్నూర్



కామరెడ్డి జిల్లా మద్నూర్ మండలం సుల్తాన్ పేట్ గ్రామంలో ఉపాధి పనులు పరిశీలించిన అడిషనల్ పీడీ వామన్ రావ్, కూలీలతో మాట్లాడుతూ కూలీల శాతం పెరగాలని చెప్పారు కూలీలందరూ సమయ పాలన పాటించి పొద్దున సమయంలో తొందరగా వచ్చి ఎండ ముదరకముందే పని ముగించుకోవాలని తెలియజేశారు.పనిలో ఎలాంటి అవకతవకలు జారగకుండా చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్ కి చెప్పారు ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రామ్ మోహన్ రావు,ఎంపిడిఓ రాణి,ఏ పి ఓ పద్మ,పంచాయతీ కార్యదర్శి సంజయ్ కుమార్,ఫీల్డ్ అసిస్టెంట్ యాదవ్,గ్రామ సర్పంచ్ రాజేశ్వర్ గౌడ్,ఉప సర్పంచ్ బాలరాజ్, పాల్గొన్నారు

## శ్రీ హనుమాన్ గుడి పునః నిర్మాణానికి విరాళం



వాస్తవం : చందుర్తి

చందుర్తి మండలం రామన్నపేట గ్రామంలో శ్రీహనుమాన్ గుడి పునః నిర్మాణానికి తిప్పని నరేష్ రూ.5 లక్షలు, నరేష్ సోదరుడు తిప్పని సురేష్ రెండు లక్షలు విరాళం అందించారు.నరేష్,సురేష్‌లుఅభినందనీయులని, వారి దాతృత్వం, భక్తి భావం, సమాజానికి సేవ చేయాలనే మనస్తత్వం అందరికి ఆదర్శమని, ఇలాంటి మహనీయుల సహకారంతోనే ఆలయ నిర్మాణం విజయవంతంగా ముందుకు సాగుతోందని,వారి సేవా భావానికి శ్రీ హనుమాన్ దేవాలయ అభివృద్ధి కమిటీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన రణం



వాస్తవం : దౌల్తాబాద్

దౌల్తాబాద్ మండల పరిధిలోని గోవిందాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ ఉప్పల అశోక్ ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం దుబ్బాక నియోజకవర్గ సమన్వయ కర్త రణం శ్రీనివాస్ గౌడ్, గోవిందపూర్ సర్పంచ్ దాస్, గువ్వలేగి సర్పంచ్ శేఖర్ రెడ్డి,బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు జనార్దన్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ప్రమాద వివరాలు అడిగి తెలుసుకుని అశోక్ మృతి బాధాకరమని బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చంద్రమౌళి గౌడ్,బిఆర్ ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు సాగర్ రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



వాస్తవం : దౌల్తాబాద్

దౌల్తాబాద్ మండలం పరిధిలోని దొమ్మాట ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు ఉత్సాహభరితంగా కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రధానోపాధ్యాయులు ఆర్. వెంకటేశం మాట్లాడుతూ.విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలు సాధించాలని సూచించారు. ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో విద్యార్థులు తమ ప్రతిభను చాటుకోవాలని ఆకాంక్షించారు.స్వయం పరిపాల దినోత్సవం సందర్భంగా విద్యార్థులు వివిధ బాధ్యతలను స్వీకరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు.కలెక్టర్‌గా రెహానా,డీఈవోగా హరిప్రియ, ఎంఈఓగా నక్షత్ర,ప్రధానోపాధ్యాయురాలిగా లాస్య బాధ్యతలు చేపట్టి కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించారు. విద్యార్థుల ప్రదర్శనలు, ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించి బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆర్అండ్ఆర్ కాలనీలకు న్యాయం చేయాలి

**బీఆర్ఎస్ యువ నాయకుడు ఎన్సీ సంతోష్**

**అభివృద్ధి లేకుండానే ఇంటి పన్ను వసూలు సరికాదు**

**మానవతా దృక్పథంతో మినహాయింపు కల్పించాలని డిమాండ్**

**వాస్తవం : గజ్వేల్ ఆర్ సి**



గజ్వేల్ ఆర్అండ్ఆర్కాలనీ వాసుల సమస్యలను రాజకీయాలకు అతీతంగా పరిష్కరించాలని బీఆర్ఎస్ యువ నాయకుడు ఎన్సీ సంతోష్ కోరారు.శుక్రవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత ఆరు సంవత్సరాలుగా ఆర్అండ్ఆర్ కాలనీ వాసులపై ఇంటి పన్ను చెల్లించాలని మున్సిపల్ అధికారులు ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు.అయితే కాలనీకి తగిన మౌలిక వసతులు, అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిస్థాయిలో చేపట్టలేదని పేర్కొన్నారు. అలాంటి పరిస్థితుల్లో పన్ను వసూలు చేయడం సమంజసం కాదన్నారు.2026 జనవరి నుంచి మున్సిపాలిటీలో విలీనం చేసినట్లు జారీ చేసిన జీవో ప్రకారం కనీసం ఆ తేదీ నుంచి మాత్రమే పన్ను వసూలు చేయాలని డిమాండ్ చేశారు. అంతకుముందు కాలనీలకు సంబంధించిన పన్నులను రద్దు చేయాలని కోరారు. లేదంటే మానవతా దృక్పథంతో వచ్చే పది సంవత్సరాలపాటు ఇంటి పన్ను మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇళ్లు, గ్రామాలు, వ్యవసాయ భూములు వదులుకుని పునరావాసంగా వచ్చిన కుటుంబాల త్యాగం ద్వారానే బృహత్తర కాలేశ్వరం,మల్లన్న సాగర్,కొండపోచమ్మ ప్రాజెక్టులు నిర్మాణం జరిగాయని గుర్తుచేశారు.అలాంటి కుటుంబాలకు ప్రభుత్వం ప్రత్యేక పరిగణన ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో 7వ వార్డు ప్రజలు, ఆర్అండ్ఆర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

# రమణీయం సీతారామచంద్రుల రథోత్సవం

**ఆధ్యాత్మికోత్సాహంతో ఆలయ వార్షికోత్సవం**

**మార్కుక్ : వాస్తవం**



మండల పరిధిలోని పాములపర్తి గ్రామంలోని సీతా రామాంజనేయ ఆలయ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా శుక్రవారం సీతారామచంద్రుల రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఉదయం ప్రత్యేక పూజలు,అభిషేకాలు,అర్చనలు నిర్వహించి, వేదమంత్రాల నాదాల మధ్య సీతారామచంద్రులను అలంకరించిన రథంపై ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని “జై శ్రీరాం”నినాదాలతో గ్రామ వీధులు మారుమోగించారు.మహిళలు హారతులు పట్టి భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు.రథోత్సవం అనేది భక్తి,ఐక్యత, ధర్మపరమైన జీవన విధానానికి ప్రతీకగా భావిస్తారు.శ్రీరాముడు సత్యధర్మాల ప్రతిరూపమని, ఆయన ఆశీస్సులు గ్రామానికి శాంతి, సౌభాగ్యాలు తీసుకురావాలని పూజారులు ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొని ఉత్సవాన్ని విజయవంతం చేశారు. భక్తి పారవశ్యంతో సాగిన ఈ రథోత్సవం గ్రామస్తులలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపింది.ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు హనుమంతరావు, మాజీ ఎంపీపీ పాండు గౌడు, బీఆర్ఎస్ బీసీ సెల్ అధ్యక్షులు మ్యాకల కనకయ్య,నాయకులు బాలకిషన్,మురళి,రాజు గ్రామస్తులు పాల్గొన్నారు.

# సెయింట్ మేరీస్ హై స్కూల్‌లో సైన్స్ ఫెయిర్

**వాస్తవం : సంగారెడ్డి**



పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని సెయింట్ మేరీస్ హై స్కూల్లో సైన్స్ ఫెయిర్ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.పాఠశాల ప్రధానోపాధ్యాయులు తులసి రెడ్డి ఆహ్వానంపై ముఖ్య అతిథిగా స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తో కలిసి బీఆర్ఎస్ నాయకులు, వీణ= ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ హాజరై రిబ్బన్ కట్ చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. సైన్స్ ఫెయిర్ ద్వారా విద్యార్థులు తమ సృజనాత్మకతను ప్రదర్శించుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. అనంతరం పృథ్వీరాజ్ ప్రతి ప్రదర్శన విభాగాన్ని సందర్శించి,విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను ఆసక్తిగా పరిశీలించారు. వారి ప్రతిభను అభినందిస్తూ ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని విద్యార్థులను ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్,సాయి తేజ,రమణ, ధనరాజ్ గౌడ్,రాజు షకీల్,మహేష్,పాఠశాల ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు,విద్యార్థులు మరియు ఎంపిఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

# చిన్నన్న, పెద్దన్న ఆలయ రేకుల షెడ్డు నిర్మాణానికి సహకారం

**వాస్తవం : కోనరావుపేట**

కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలో వెలసిన చిన్నన్న, పెద్దన్న దేవాలయ ఆవరణలో భక్తుల సౌకర్యార్థం రేకుల షెడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరిగిన ఈ పూజా కార్యక్రమం భక్తుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు.ఈ షెడ్డు నిర్మాణానికి మాజీ సర్పంచ్ కొక్కుల భారత- నర్సయ్య, వేములవాడ 25వ వార్డు కౌన్సిలర్ కొక్కుల బాలకృష్ణ (రాజు), కుటుంబ సభ్యులు దాతలుగా ముందుకు వచ్చారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎండ, వానల నుండి రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో తమ స్వంత ఖర్చులతో ఈ



నిర్మాణాన్ని చేపడుతున్నట్లు దాతలు తెలిపారు.దాతల ఉదారతను అభినందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు,కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

**రోడ్డు ప్రమాదాల నివారణలో**

# భాగస్వామ్యం కావాలి

**వేములవాడ ఎఎస్పీ రుత్విక్ సాయి**

**వాస్తవం : వేములవాడ**




రోడ్డు ప్రమాదాల నివారణలో విద్యార్థుల భాగస్వామ్యం కావాలని వేములవాడ ఎఎస్పీ రుత్విక్ సాయి విద్యార్థులకు పిలుపునిచ్చారు.అరైవ్-అలైవ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ మహేష్ బి గితే ఆదేశాల మేరకు వేములవాడ మండలంలోని అగ్రహారంలోని కె-కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాల విద్యార్థులకు రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియమలపై అవగాహన కార్య క్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎఎస్పీ రుత్విక్ సాయి మాట్లాడుతూ..విద్యార్థి దశ నుండే రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించుకోవడం వలన రోడ్డు ప్రమాదాలు నివారించవ చ్చన్నారు. జిల్లాలో ఎస్పీ ఆదేశాల మేరకు అరైవ్ ఆలైవ్ కార్య క్రమంలో భాగంగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేప డుతున్నామన్నారు. ట్రాఫిక్ నియ మాల ఉల్లంఘన వల్ల జరిగే ప్రమాదాలు కుటుంబాలకు తీవ్ర నష్టం కలిగిస్తాయని పేర్కొన్నా రు.ప్రతి ఒక్కరు సామాజిక బా ధ్యతగా వాహనం నడిపే సమ యాల్లో హెల్మెట్ ధరించడం, సీ టు బెల్ట్ వినియోగం,తప్పని సరని,అతివేగం నివారణ,మద్యం సేవించి వాహనం నడపడం, ర్యాష్,రాంగ్ రూట్ డ్రైవింగ్ చేయ వద్దని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వేములవా డ పట్టణ సి ఐ వీరప్రసాద్, ట్రాఫిక్ ఆర్ఐ సురేష్, ఎస్ఐ లు రామ్మోహన్, రాజు,షీ టీమ్ ఎఎస్ఐ ప్రమీల సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**కవిత పై అక్రమ కేసుకు తగిన**

# మూల్యం చెల్లించుకోక తప్పదు

**కడిగిన ముత్యంలా బయటపడిన జాగృతి చైర్మన్ కవిత**

**జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి ముదిరాజ్**

**వాస్తవం : గజ్వేల్ ఆర్ సి**



లిక్కర్ కేసులో జాగృతి వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత కడిగిన ముత్యంలా బయటపడగా, ఆమె పడిన మానసిక క్షోభకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు, హైకోర్టు న్యాయవాది కొట్టాల యాదగిరి ముదిరాజ్ పేర్కొన్నారు. శుక్రవారం రౌస్ ఎవెన్యూ కోర్టు కవితను నిర్దోషిగా ప్రకటించగా, ఆమెపై సిబిఐ మోపిన అభియోగాలన్నింటిని కొట్టివేసినట్లు తెలిపారు.సిబిఐ ప్రత్యేక కోర్టు జడ్జి జితేందర్ సింగ్ ఇచ్చిన తీర్పుతో ప్రజలకు చట్టాలు, కోర్టులపై మరింత నమ్మ కం పెరిగిందని అన్నారు. కవితకు కో ర్టు క్లీన్ చిట్ ఇవ్వడంతో ఎలాంటి సాక్షాదారాలు లే కుండా సిబిఐ అక్రమంగా లిక్కర్ కేసు నమోదు చేసి నట్లు అర్థమ వుతుందని విమర్శించారు. సిబిఐ వంటి రాజ్యాంగ సంస్థ వత్తడిలతో కవితపై అక్రమంగా కేసు పెట్టి జైలు పాలు చేయడం సిగ్గుచేటు కాగా,ఇందులో ఉన్న సూ త్రధారులు,పాత్రధారులకు తగిన బుద్ధి చెప్తా మని చెప్పారు.రాష్ట్రంలో జాగృతి మరింత ఉత్సాహంతో పని చేయనుండగా,బీసీల హక్కుల సాధన, 42 శాతం రిజర్వేషన్ తదితర అంశాలపై రాజీలేని పోరాటం చేస్తామని వివరించారు.

# చిన్నన్న,పెద్దన్న ఆలయ రేకుల షెడ్డు నిర్మాణానికి సహకారం



వాస్తవం : కోనరావుపేట

కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలో వెలసిన చిన్నన్న, పెద్దన్న దేవాలయ ఆవరణలో భక్తుల సౌకర్యార్థం రేకుల షెడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరిగిన ఈ పూజా కార్యక్రమం భక్తుల స మక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ షెడ్డు నిర్మాణానికి మాజీ సర్పంచ్ కొక్కుల భారత– నర్సయ్య, వేములవాడ 25వ వార్డు కౌన్సిలర్ కొక్కుల బాలకృష్ణ(రాజు), కుటుం బ సభ్యులు దాతలుగా ముందుకు వచ్చారు. ఆలయాని కి వచ్చే భక్తులకు ఎండ, వానల నుండి రక్షణ కల్పించా లనే ఉద్దేశంతో తమ స్వంత ఖర్చులతో ఈ నిర్మాణాన్ని చేపడుతున్నట్లు దాతలు తెలిపారు. దాతల ఉదారతను అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రామాల్లో వార్డు సభ్యులు పారదర్శకంగా విధులు నిర్వహించాలి



వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు ముగింపు

వాస్తవం : దౌల్తాబాద్

గ్రామాల్లో సంక్షేమ పథకాలు నిజమైన అర్హులకు అం దేలా వార్డు సభ్యులు కృషి చేయాలని ఎంపీడీవో సయ్య ద్ గఫూర్ ఖాద్రి సూచించారు. దౌల్తాబాద్ మండల పరి ధిలోని దొమ్మాట రైతు వేదికలో ఐదు రోజులుగా 12 గ్రామపంచాయతీల వార్డు సభ్యులకు నిర్వహించిన శిక్ష ణ తరగతులు శుక్రవారం ముగిశాయి. గ్రామపంచాయ తీ పాలన, గ్రామాభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రభు త్వ పథకాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ శి క్షణ కార్యక్రమాలను నిర్వహించారు. శిక్షణలో గ్రామ అభివృద్ధి ప్రణాళికల తయారీ, పారిశుధ్య నిర్వహణ, త్రాగునీటి సరఫరా, పన్నుల వసూలు, ప్రజల సమస్యల పరిష్కారం వంటి అంశాలపై సంబంధిత శాఖల అధి కారులు వార్డు సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, గ్రామాభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. ప్ర జలతో సమన్వయం చేసుకుంటూ పారదర్శకంగా విధు లు నిర్వహించాలని, గ్రామాల్లో సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని సమర్థవంతంగా పరిష్కరించేలా పని చే యాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరేలా ప్రత్యేక శ్రద్ధ వహించాల ని పిలుపునిచ్చారు. శిక్షణ ముగింపు సందర్భంగా వార్డు సభ్యులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నర్సింలు,ట్రైనర్లు రవీందర్ రెడ్డి, గౌస్, వినోద్ కుమార్,అర్షద్,పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్,గోపి,రాజేష్,రవీందర్,శ్రావణ్,మల్లేశం, మౌని క,అజయ్,నరేష్,ఆపరేటర్ నవీన్ పాల్గొన్నారు.

# వార్డు సభ్యుల శిక్షణా శిబిరం విజయవంతం



జైపూర్ : వాస్తవం

జైపూర్ మండల పరిధిలోని 10 గ్రామపంచాయతీల వార్డు సభ్యుల కోసం ఏర్పాటు చేసిన ఐదు రోజుల శి క్షణా శిబిరం శుక్రవారం ముగిసిందని ఎంపీడీవో సత్య నారాయణ తెలిపారు. ఫిబ్రవరి 23 నుంచి 27 వరకు మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 94 మంది వార్డు సభ్యులు పా ల్గొన్నారు. నాలుగు మంది ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ ( టి ఓ టి )ల ఆధ్వర్యంలో సర్పంచ్, వార్డు సభ్యుల హక్కులు బాధ్యతలు, నూతన పంచాయతీరాజ్ చట్టం, గ్రామపం చాయతీ ఆదాయ వ్యయాల నిర్వహణ, రికార్డుల సంర క్షణ, రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు విధానాలపై సమగ్ర శిక్షణ అందించారు. చివరి రోజు పాల్గొన్న సభ్యులకు పరీక్ష నిర్వహించి సర్టిఫికేట్లు అం దజేశారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు మాట్లాడు తూ శిక్షణ తమకు ఎంతో ఉపయోగకరంగా నిలిచింద ని, గ్రామాభివృద్ధి కార్యక్రమాలను సమర్థంగా నిర్వహిం చేందుకు స్పష్టమైన అవగాహన కలిగిందని పేర్కొన్నారు. శిక్షణా కాలంలో అందించిన సౌకర్యాలపై నిర్వాహకు లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమానికి ఎంపీడీవో జి. సత్యనారాయణ, ఎంపీఓ శ్రీపతి బాపు రావు హాజరై, శిక్షణలో నేర్చుకున్న అంశాలను గ్రామపంచాయతీలలో అమలు చేసి గ్రామాలను అభివృద్ధి పథంలో ముందుకు నడిపించాలని సూచించారు. అనంతరం వారు వార్డు సభ్యులకు సర్టిఫికేట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమం లో టి వో టి లు పి. సురేష్,ఎన్. దేవేందర్,ఎం. సురేష్, ఈ. రమేష్, పంచాయతీ కార్యదర్శులు మరియు వివిధ గ్రామాల వార్డు సభ్యులు పాల్గొన్నారు.


జన్మదినోత్సవాలు, పదవీ విరమణ శుభాకాంక్షల

ప్రకటనల కోసం సంప్రదించండి

8074124190





పదవ తరగతి విద్యార్థులకు

# ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ



వాస్తవం : ఉప్పల్

ఉప్పల్ జెడ్.పి.హెచ్.ఎస్ ప్రభుత్వ స్కూల్ లో పదవ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ కార్యక్ర మం ఉప్పల్ డివిజన్ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సహాయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఆకుల మహేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ చేశారు. ఈ సం దర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రులు,గురు వులు నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యాభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్ర మంలో స్థానిక బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు, ఉ పాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

3న వేములవాడ రాజన్న

# భీమన్న ఆలయం మూసివేత



వాస్తవం : వేములవాడ ఆర్ సి ఇంచార్జ్

చంద్రగ్రహణం సందర్భంగా మార్చి 3న ఉదయం వే ములవాడ రాజరాజేశ్వరస్వామి, భీమేశ్వరస్వామి ఆల యాలను మూసివేయనున్నట్లు ఆలయ అర్చకులు తెలి పారు. మార్చి 3న ఉదయం ప్రాతఃకాల పూజ అనం తరం రాజన్న ఆలయంతోపాటు అన్ని అనుబంధ దే వాలయాలను మూసివేస్తారు. అదే రోజు రాత్రి 7 గం టలకు సంప్రోక్షణ అనంతరం యధావిధిగా పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మ. 3:30కు ప్రారంభ మై పాక్షిక చంద్రగ్రహణం సా. 6 ముగుస్తుంది.

మాజీ సర్పంచ్ తండ్రి మృతికి

# మంత్రి వివేక్ సంతాపం

జైపూర్ : వాస్తవం



మాజీ సర్పంచ్ తండ్రి మృ తికి మంత్రి వివేక్ సంతా పం తెలిపారు. జైపూర్ మం డలం టేకుమట్ల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తం డ్రి గోనె పోషం ఇటీవల కన్నుమూశారు. ఆయన మృతి పట్ల వారి కుటుంబ స భ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. మృతిచెందిన విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకట స్వామి శుక్రవారం గ్రా మానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించా రు. మృతుని చిత్రపటానికి పూలమాల అర్పించి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చె ప్పారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కుటుం బానికి ఇది తీరని లోటని,వారి కుటుంబానికి ప్రభు త్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కా ర్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,నాయకులు, గ్రా మ పెద్దలు పాల్గొన్నారు.

# మాట ఇచ్చాం బస్సు తెచ్చాం

వాస్తవం : రాజేంద్రనగర్

ప్రజలకు సౌకర్యాలను కల్పించడమే మా ముఖ్య ఉద్దేశ్యం అని మాట ఇచ్చిన ప్రకారం గ్రామస్తులకు బస్సు సౌకర్యం కల్పించామని రాజేంద్రనగర్ నియోజకవర్గ బిజెపి ఇంచార్జ్ తోకల శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం రాజేంద్రనగర్ నియోజకవర్గం మండలంలోని నానాజీపూర్ గ్రామంలో బస్సు సర్వీస్ ను ఆయన స్థానిక గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... ఈ గ్రామానికి బస్సు సౌకర్యం లేక గ్రామస్తులు ముఖ్యంగా విద్యార్థులకు తీవ్ర ఇబ్బంది ఉన్నట్లుగా మా దృష్టికి వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో మొన్న సర్పంచ్ ఎలక్షన్లో బిజెపి పార్టీ అభ్యర్థి తరఫున ప్రచారంలో భాగంగా గెలిచినా ఓడిన గ్రామానికి బస్సు సర్వీసు తెప్పిస్తానని మాట ఇచ్చానని గుర్తుచేశారు. అన్నమాట ప్రకారం టీజీఎస్ ఆర్టీసీ ఉన్నత అధికారులతో పలుమార్లు బస్సు సౌకర్యం కొరకు చర్చించి పరిష్కారం చూపమన్నారు. ఈ సహకారానికి తోడ్పాటు అందించిన ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డికి



కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో రోజులుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామస్తులు, విద్యార్థులు యువకులు హర్షం వ్యక్తం చేస్తూ శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సురేష్ రాజు, ఉప సర్పంచ్ విజయ్ కుమార్, వంగ మహేందర్ రెడ్డి, ముసుగుల రాజిరెడ్డి, వార్డు సభ్యులు మున్నూరు సిద్దులు, మైలారం రాధికా-శ్రీనివాస్,శ్రీనివాస్ రెడ్డి,సిద్దేశ్వర్ గౌడ్, సంతోష్ కుమార్,వెంకటేష్ గౌడ్,మైలారం దర్శన్, మైలారం కృష్ణ,శ్రీనివాస్ గౌడ్ స్థానిక యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సంత్ సేవాలాల్ మహారాజ్ మార్గం స్ఫూర్తిదాయకం

**కుటుంబంతోపాటు సమాజానికి సేవ చేయడమే ధ్యేయంగా ముందుకు సాగాలి**

**బాన్సువాడలో ఘనంగా శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ ఘనంగా జయంతి ఉత్సవాలు**

వాస్తవం : కామారెడ్డి

బంజారాల ఆరాధ్య దైవం శ్రీ సేవాలాల్ మహారాజ్ వ్యక్తి కాదు ఆధ్యాత్మిక గురువు అని, ఆయన చూపిన సన్మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకుంటూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం బాన్స్వాడ పట్టణంలోని భారత్ గార్డెన్లో ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయితో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా నియోజకవర్గంలోని బంజరులతో కలిసి భోగ్ బండారు కార్యక్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలతో పాటు ఆశ్రమ పాఠశాలకు సంబంధించిన విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు నృత్యాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. అనంతరం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఎక్కడో జన్మించి భారతదేశం మొత్తం తిరుగుతూ బంజారులను ఏక త్రాటిపై తీసుకొచ్చిన మహా వ్యక్తి సంత్ సేవాలాల్ మహారాజ్ అన్నారు. ఒక వ్యక్తి ఒక స్థాయికి ప్రజల్లో మంచి గుర్తింపు రావాలంటే ఊరికే రాదని,ఎంతో శ్రమతో కూడుకున్న పని అని అన్నారు. ప్రభుత్వం సైతం అధికారికంగా జయంతి ఉత్సవాలను నిర్వహిస్తుందని బంజారాల అభివృద్ధికి ఆర్థిక అభివృద్ధికి తండాలో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. పోడు భూములకు పట్టాలను అందించేందుకు కృషి చేశామని బంజారాలతో ఎన్నో ఏళ్లుగా అనుబంధం ఉందని మునుముందు కూడా ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నాను. అనంతరం ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం అధ్యక్షులు బధ్యానాయక్ మాట్లాడుతూ బంజారా సమాజానికి ఆధ్యాత్మిక గురువు సామాజిక సంస్కర్తగా ప్రసిద్ధి చెందిన మహా వ్యక్తి సంత్ సేవాలాల్ అని ఆయన బోధనలు ధర్మం సేవా సమానత్వం నైతిక జీవన విధానంపై దృష్టి సారించారన్నారు. సమాజ శ్రేయస్సు కోసం కులమత భేదాలు లేకుండా అందరూ సమానంగా సమాజంలో మెలగాలని బంజారా సమాజాన్ని అజ్ఞానం మూఢనమ్మకాలను దూరం చేసేందుకు ఎనలేని కృషి





చేశారని అన్నారు. విద్య నైతిక విలువల వైపు దారి చూపించారని ఆయన ప్రభావంతో అనేక తండాల్లో ఆధ్యాత్మిక చైతన్యం పెరిగిందన్నారు. బాన్సువాడ నియోజకవర్గం సమీపంలో మొట్టమొదటిసారిగా వెంకటాపూర్ తండాలో జగదాంబ మాత సంత్ సేవాలాల్ మహారాజ్ మందిరాలను నిర్మించడం జరిగిందని వీటిని ఆదర్శంగా తీసుకొని ఆయాచోట్ల 258 జగదాంబ మాత సంత్ సేవాలాల్ మహారాజ్ మందిరాలు నిర్మించుకున్నట్లు ఆయన గుర్తు చేశారు. బాన్సువాడ పట్టణంలో అధికారికంగా సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలకు నియోజకవర్గంలో పాటు ఆయా ప్రాంతాలకు చెందిన బంజారా సోదర సోదరీమణులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి లంబాడి భాషలో మాట్లాడడంతో కార్యక్రమానికి వచ్చిన అందరూ ఆశ్చర్య పోవడంతో పాటు సబ్ కలెక్టర్‌ను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో బీర్కూరు ఏఎంసీ చైర్మన్ శ్యామల శ్రీనివాస్, బంజారా సోదరులు మోహన్ నాయక్ ప్రతాప్ సింగ్ అర్జు నాయక్ హరి సింగ్ నరేష్ రాథోడ్ పాల్యవిట్టల్ సంగ్రం నాయక్ ప్రేమ్ సింగ్ జగురం బస్సీలాల్, బాన్సువాడ తాసిల్దార్ రాజా నరేందర్ గౌడ్ ఎంపీడీవో ఆనంద్ కుమార్ నాయకులు ఎరవల కృష్ణారెడ్డి జంగం గంగాధర్ నార్ల సురేష్ , దుద్దాల అంజిరెడ్డి, గుప్త గురువినై పాల్గొన్నారు.

**మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకి**

# భూమి పూజ



వాస్తవం : ఉప్పల్

మల్లాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణానికి సంబంధించిన భూమి పూజ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి,పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యాభివృద్ధే సమాజ పురోగతికి మూలాధారం అని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల మౌలిక వసతుల అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. విద్యార్థులకు మెరుగైన వాతావరణంలో విద్య అందించాలనే లక్ష్యంతో ఈ నిర్మాణ పనులు చేపట్టడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమానికి టెక్నైఫ్ ఎఫ్ఎంసి సంస్థ స్పాన్సర్‌గా వ్యవహరించగా, హ్యాండ్ ఇన్ హ్యాండ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ భాగస్వామిగా ఉంది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బేతి సుభాస్ రెడ్డి,మాజీ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి,ప్రభుదాస్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆప్టికల్ షాప్‌కి నోటీస్



వాస్తవం : సిరిసిల్ల

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ రజిత ఆధ్వర్యంలో వైద్య బృందం ఆఫీస్ బాయ్ ఆప్తమాలజిస్ట్ ఆప్టికల్ షాపు నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి షోకాస్ నోటీస్ జారీచేసి ఆ క్లినిక్ ను తాత్కాలికంగా మూసివేయుటకు ఆదేశిస్తూ, చర్య నిమిత్తం పై అధికారులకు తెలియపరుస్తూ, జిల్లాలోని ఆప్టికల్ షాపులు కండ్ల అద్దాలు మాత్రమే అమ్మ వలసిందిగా డాక్టర్ లేకుండా ప్రేస్క్రిప్షన్ చేయడానికి అనుమతులు లేవని జిల్లాలోని ఆప్టికల్ షాపులకు సూచించారు. డాక్టర్ తో నడిచే ఆప్టికల్ షాపు తప్పనిసరిగా జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో క్లినికల్ ఇష్టాలేస్మెంట్ యాక్ట్ ప్రకారం రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిందిగా సూచిస్తూ ,లేనియెడల చర్యలు తీసుకుంటామని ఆదేశించారు.

**స్ఫూర్తి ఆశ్రమానికి 25 కిలోల బియ్యం,**

# నిత్య అవసరాలు అందజేత



పెద్దపల్లి : వాస్తవం

శుక్రవారం నాతరి జాయ్ అఖిర్ నంద జన్మదిన సందర్భంగా పెద్దపల్లి లోని స్ఫూర్తి మానసిక వికలాంగుల ఆశ్రమానికి నాతరి ఆదిత్య సుజాత దంపతులు 25 కిలోల రైస్ బ్యాగ్‌తో పాటు నిత్యావసర వస్తువులను అందజేశారు. స్ఫూర్తి ఆశ్రమ సిబ్బంది వారికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేశ స్వేచ్ఛ సంపాదకీయుడు పల్లె శాంతిరాజ్,పాస్టర్‌సోలోమోన్, నాతరి రాయమల్లు, పోచమ్మ పాల్గొన్నారు.

# 50 మంది కార్యకర్తలు పార్టీలో చేరిక

**వాస్తవం : చెన్నూరు ఆర్సి**



వివేక్ వెంకటస్వామి సమక్షంలో చెన్నూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన సుమారు 50 మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వారు పార్టీలో చేరినట్లు తెలిపారు.సుద్దాల గ్రామ సర్పంచ్ డొంగిరి స్వప్న ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరిక కార్యక్ర మంలో మంత్రి వివేక్ వెంకటస్వామి కొత్తగా చేరిన కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వా నించారు.ఈ సందర్భంగా మంత్రి మా ట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని తెలిపారు. గ్రామ స్థాయిలో ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాల లబ్ధి చేరేలా కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు.కాంగ్రెస్ పార్టీని మరింత బలో పేతం చేయడానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

# చెన్నూరును ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం

**మంత్రి వివేక్ వెంకటస్వామి**

**వాస్తవం : చెన్నూరు ఆర్ సి**



వివేక్ వెంకటస్వామి చెన్నూరు మున్సిపాలిటీలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్పర్సన్ పెద్దింటి పద్మ పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొ న్నారు. ఈ సందర్భంగా చైర్పర్సన్‌తో పాటు పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.మంత్రి మాట్లాడుతూ చెన్నూరు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులను గెలిపించి మున్సిపాలిటీలో బాధ్యతలు అప్పగించినందుకు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. కౌన్సిలర్లు ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండి, వారి సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరించే దిశగా పని చేయాలని సూచించారు. చెన్నూరు మున్సిపాలిటీలో సుమారు రూ.50 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. అనేక వార్డుల్లో బోర్‌వెల్స్, సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్ల నిర్మాణ పనులు కొన సాగుతున్నాయని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అమృత్ 2.0 పథకం ద్వారా ఇంటింటికి తాగునీరు అందజేస్తామని హామీ ఇచ్చారు.గత ప్రభుత్వం మిషన్ భగీరథ పేరిట నిధులను దుర్వినియోగం చేసిందని విమర్శించిన మంత్రి, చెన్నూరు పట్టణ ప్రజలకు గోదావరి నుంచి శుద్ధజలాల పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. త్వరలో పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు కూడా చేపడతామని వెల్లడించారు. పట్టణంలోని కుల సంఘాల భవనాల నిర్మాణానికి ఇప్పటికే నిధులు కేటాయించినట్లు తెలిపారు. మరో ఆరు నెలల్లో గోదావరి ఇసుకను అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. మారెమ్మ వాడలో రహదారి సమస్యను పరిష్కరించామని గుర్తుచేశారు.మున్సిపాలిటీలో 100 కొత్త ఇం దిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల సమస్యలపై కేబినెట్‌లో చర్చలు జరిపినట్లు పేర్కొ న్నారు. దేవులవాడ, బబ్బేరు, చెలుక గ్రామాల రైతులకు సుమారు రూ.18 కోట్ల పరిహారం మంజూరు చేసి పంపిణీ చేసినట్లు వివరించారు.మే నెలలో 100 పడకల ఆసుపత్రిని ప్రారంభిం చనున్నట్లు తెలిపారు. కోటి ఇరవై లక్షల రూపాయలతో శ్మశాన వాటిక అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని చెప్పారు.చెన్నూరులోని ప్రతి వార్డులో సమన్వయంతో పని చేసి మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దామని మంత్రి వివేక్ వెంకటస్వామి పిలుపు నిచ్చారు.

# ఎస్ఎల్‌సిలో ప్రతిభను చాటిన విద్యార్థులు

**వాస్తవం : రాజేంద్రనగర్**



సీబీఎస్ఈ కిస్మత్పూర్ నారాయణ పాఠశాల బ్రాంచ్ లో రెండవ రోజు జరిగిన స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ (ఎస్ఎల్ సి) సెమిస్టర్ 2 లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏజీఎం శ్రీనివాస్ రెడ్డి విచ్చేశారు. విద్యార్థులు తాము నేర్చుకున్న పాఠ్యాంశాలను ప్రాజెక్టుల రూపంలో రూపొందించారు. సైన్స్‌కు సంబంధించిన ప్రాజెక్టులను టెక్నాలజీతో కూడుకున్న అంశాలను విద్యార్థులు తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు వివరించారు. విద్యార్థుల చదువుతోపాటు వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను, నైపుణ్యాలను వెలికి తీసేందుకే ఇలాంటి కార్యక్రమాలను చేపడుతున్నట్లు ఏజీఎం తెలిపారు. నారాయణ పాఠశాలలోని ప్రతి బ్రాంచ్ లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పాఠశాల ప్రిన్సిపల్ గోపు సురేష్ కుమార్, ఆర్ అండ్ డి హెడ్ సునీత, కోఆర్డినేటర్ తబిత, సాఫ్ట్ స్కిల్స్ హెడ్ సంజన, అకాడమిక్ డీన్ తులసి, వైస్ ప్రిన్సిపల్ రమ్య, ఏఓ మనోజ్ కుమార్ తరగతి గదులలో విద్యార్థులు చేసిన ప్రాజెక్టులను తల్లిదండ్రులతో కలిసి పరిశీలించారు.

# రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

**మండల వ్యవసాయ అధికారి స్రవంతి**



**వాస్తవం : మనోహరాబాద్:**

వ్యవసాయ భూమి కలిగి ఉన్న ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి స్రవంతి అన్నారు.మనోహరాబాద్ మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ కళ్ళకల్ గ్రామంలో శుక్రవారం వ్యవసాయ అధికారులు నిర్వహించిన రైతు గుర్తింపు కార్డు కార్యక్రమంలో ఆమె పాల్గొని రైతులకు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధార్ గుర్తింపు కార్డు లాగా రైతులకు విశిష్ట గుర్తింపు ఇచ్చేందుకు సంఖ్య యూనిక్ ఫార్మర్ ఐడి జారీ చేసేందుకు,ప్రత్యేకంగా ఫార్మర్ రిజిస్ట్రే పోర్టల్‌లో రైతుల వివరాలు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. అందుకే రైతులు తప్పనిసరిగా వ్యవసాయ అధికారులకు సహకరించి ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకుని,కేంద్ర ప్రభుత్వం అందించే పీఎం కిసాన్ తోపాటు ఇతర కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల లబ్ధికి ఇట్టి రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వీరబోయిన ప్రవీణ్ కుమార్ ముదిరాజ్,పాలకవర్గ సభ్యులు,కాంగ్రెస్ నాయకులు మద్దూరి నాగరాజ్ గౌడ్,వ్యవసాయ అధికారి సచిన్,రైతులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్‌ను కలిసిన పీఎం శ్రీ నోడల్ అధికారి



**వాస్తవం : రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)**

రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్‌ను పీఎంశ్రీ నోడల్ అధికారి ప్రవీర్ కుమార్ శుక్రవారం కలిసారు.పీఎం శ్రీ కింద జిల్లాలోని పలు విద్యాలయాల్లో అమలు అవుతున్న కార్యక్రమాలను పీఎంశ్రీ నోడల్ అధికారి, కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్, అర్బన్ ఎఫైర్స్ జాయింట్ సెక్రటరీ ప్రవీర్ కుమార్ పరిశీలించేందుకు వచ్చి.. కలెక్టర్‌ను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మర్యాద పూర్వకంగా కలువగా, పుష్ప గుచ్ఛం అందజేశారు.ఈ సందర్భంగా పీఎంశ్రీ కింద అమలు చేస్తున్న కార్యక్రమాలు, వివిధ నిర్మాణ పనులపై చర్చించారు.




# పీఎం శ్రీ కార్యక్రమాల అమలు పరిశీలన

**వాస్తవం: సిరిసిల్ల**

పీఎం శ్రీ కింద రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పలు విద్యాలయాల్లో అమలు అవుతున్న కార్యక్రమాలను పీఎంశ్రీ నోడల్ అధికారి, కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్, అర్బన్ ఎఫైర్స్ జాయింట్ సెక్రటరీ ప్రవీర్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తంగళ్ళపల్లి మండలం మండెపల్లి లోని మోడల్ స్కూల్, కేంద్రీయ విద్యాలయాలను సందర్శించారు. మోడల్ స్కూల్, కేంద్రీయ విద్యాలయంలో పీఎంశ్రీ కింద అమలు చేస్తున్న కార్యక్రమాలను ఆసక్తిగా తిలకించారు. ఆయా పాఠశాలలో పూల మొక్కను నాటారు. పీఎంశ్రీ కింద జిల్లాలోని ఆయా స్కూల్ లలో చేపట్టిన పనులను త్వరితగతిన పనులను పూర్తి



చేయాలని సూచించారు. విద్యార్థులను పాఠ్యాంశాలతో పాటుగా అన్ని రంగాల్లో ఉత్తమ ప్రతిభ చూపేట తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రదర్శనలు, ఇతర కార్యక్రమాలను అభినందించారు. అన్ని విద్యాలయాల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని, విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో రాణించేలా ప్రోత్సాహం అందించాలని సూచించారు.

అనంతరం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో పీఎంశ్రీ అమలు పై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్ డిఓ వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, పాఠశాల విద్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనార్దన్ రావు, సమగ్ర శిక్ష రాష్ట్ర కోఆర్డినేటర్ విక్రమ్ రెడ్డి, జిల్లా కోఆర్డినేటర్ దబ్బెడ హన్మండ్లు పాల్గొన్నారు.

# నిబంధనలు పాటిస్తేనే భద్రత

**- గజ్వేల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఎం. మురళి**



**వాస్తవం, గజ్వేల్ ఆర్ సి :**

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా అరైవ్ – అలైవ్ రెండో విడత అవగాహన కార్యక్రమాన్ని గజ్వేల్ బీఎంఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. గజ్వేల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఎం. మురళి విద్యార్థులకు డిఫెన్స్ డ్రైవింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థి దశలోనే ట్రాఫిక్ నిబంధనలు పాటించే అలవాటు పెంపొందించుకోవాలని తెలిపారు. మానవ తప్పిదాల వల్లే ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అతివేగం, నిర్లక్ష్యం, మద్యం సేవించి వాహనం నడపడం ప్రమాదాలకు ప్రధాన కారణాలన్నారు. కారణం లేని మరణం ఒక రోడ్డు ప్రమాదమేనని అన్నారు. డిఫెన్స్ డ్రైవింగ్ అంటే ముందస్తు జాగ్రత్తలతో వాహనం నడపడం అని వివరించారు. వేగ పరిమితులను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ట్రాఫిక్ సిగ్నల్స్, రహదారి సూచనలను గౌరవించాలని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపరాదని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఎస్ఐ ప్రేమ్ దీప్, ట్రాఫిక్ సిబ్బంది, గజ్వేల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యక్తిగత పరిశుభ్రత ముద్దు

# మానసిక ఒత్తిడి వద్దు

**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఎస్ అనిత**

**వాస్తవం : మందమర్రి :**

మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణ మున్సిపాలిటీలో నిర్వహిస్తున్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల మానసిక ఒత్తిడి ,పరిశుభ్రతపై అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురి కాకుండా.. తీసుకోవలసిన జాగ్రత్తల పైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో.. జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, సి హెచ్ ఓ కాకిరాల వెంకటేశ్వర్లు ,ప్రధానోపాధ్యాయులు మాధవి ,జైవంతరావు ,ఆరోగ్య సిబ్బంది పద్మ ,లలిత ,సురేఖ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత ,మానసిక ఒత్తిడికి గురి కాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు ,పదవ తరగతి విద్యార్థులు పరీక్షా సమయం దగ్గర పడుతున్న కారణంగా ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ.. మానసిక ఒత్తిడికి




కాకుండా తీసుకోవలసిన జాగ్రత్తల పైన అవగాహన కలిగించారు .పటిష్టమైన మానసిక ఆరోగ్యానికి తల్లిదండ్రుల ప్రోత్సాహము ఉపాధ్యాయుల ప్రోత్సాహం అవసరము, మనసు ,శరీరం ఆరోగ్యంగా ఉండడానికి దోహదపడుతుంది. విద్యార్థులు దురాలవాట్లకు దూరం ఉండాలన్నారు. ప్రతి దినం సమతుల ఆహారం తీసుకుంటూ..రోజుకు కనీసం 8 గంటల పాటు నిద్రపోవాలి. సుదీర్ఘ సమయాన్ని చదువు కేటాయిస్తే వ్యాయామానికి సమయం దొరకదు అందువలన శరీరము బద్ధకంగా మారుతుంది. మెదడు ప్రతికూలంగా స్పందిస్తుంది. శారీరకంగా చురుకుగా ఉండాలంటే.. వ్యాయామం కూడా తప్పని సరి చేయాలి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి మంచి అలవాట్లను చేసుకోవాలి. అదే విధంగా చదువు పైన ఏకాగ్రత కేటాయించుకోవాలి, పాఠశాలల్లో ,రెసిడెన్షియల్ కళాశాలలో .. విద్యార్థులకు సమతుల్య ఆహారము వేడి –వేడి ఆహార పదార్థాలు అందించడం వలన ఆరోగ్యంగా ఉంటారు . వ్యాధులు ప్రబలకుండా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ,వాతావరణ మార్పులతో వచ్చే వ్యాధులకు తగు చికిత్సలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో తీసుకోవాలని కోరారు.

# కల్యాణ లక్ష్మి షాది ముభారక్ చెక్కుల పంపిణీ



**వాస్తవం : ఉప్పల్:** ఉప్పల్ మున్సిపల్ కార్యాలయంలో ఉప్పల్ మండలానికి చెందిన 151మందికి కల్యాణ లక్ష్మి, షాది ముభారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,చెక్కుల పంపిణీ కార్యాలయం పారదర్శకంగా జరగాలి అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన విధంగా లక్ష నూట పదహారు రూపాయలతో తులం బంగారం ఇవ్వాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మార్వో పూల్ సింగ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

**వాస్తవం : బాన్సువాడ**


బాన్సువాడ పట్టణంలోని శ్రీ చైతన్య స్కూలుకు చెందిన విద్యార్థులు ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్‌లో మంచి ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించినట్లు ప్రిన్సిపల్ అశ్విని తెలిపారు. ఈ పరీక్షల్లో నాలుగో తరగతి చదువుతున్న మహమ్మద్ హుమాయేద్ ఉల్త లహ, ఏడవ తరగతి చదువుతున్న బుజ్జపు శంకర రాజ్ అఖిల భారత స్థాయిలో రెండవ స్థానాన్ని సాధించినట్లు తెలిపారు అలాగే ఆరో తరగతి చదువుతున్న ఎం విరాట్ మూడో స్థానంలో నిలిచి బహుమతులు సాధించారని ఐదవ తరగతి చదువుతున్న జాదవ్ శివకన్య ఏడవ తరగతి చదువుతున్న విశ్వ సాయి నాలుగో స్థానంలో నిలిచారని మూడవ తరగతి చదువుతున్న కే ప్రసాద్ ఐదవ స్థానంలో నిలిచి బహుమతులు గెలుచుకున్నారన్నారు ఈ సందర్భంగా శ్రీ చైతన్య స్కూల్ చైర్మన్ మల్లంపాటి శ్రీధర్ డైరెక్టర్ శ్రీవిద్య ఏజీఎం మైపాల్ రెడ్డి రాష్ట్ర సమన్వయకర్త జయరాజ్ బాన్సువాడ సమన్వయకర్త మహిపాల్ రెడ్డి ప్రైమరీ ఇన్చార్జి హారిక లో ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించిన విద్యార్థులను అభినందించారు ఈ కార్యక్రమంలో ఇన్చార్జి సాయిప్రసాద్ విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. శ్రీ చైతన్య విద్యార్థులు ఇండియన్ నేషనల్



టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్ ఐ ఎన్ టి ఎస్ ఓ లో ప్రతిభ కనబరచడం పట్ల పలువురు ప్రసంశించారు. రాబోయే రోజుల్లో మరిన్ని రంగాల్లో ప్రతిభ కనబరిచి అటు ఉపాధ్యాయులు ఇటు పాఠశాల తల్లిదండ్రులకు మంచి పేరును తీసుకొని రావాలని కోరుకుంటున్నామని శ్రీ చైతన్య ఉపాధ్యాయ బృందం ఆశాభావం వ్యక్తం చేశారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

**వాస్తవం : చందుర్తి**



చందుర్తి మండలం మరిగడ్డ గ్రామ శివారులో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. మల్యాల గ్రామానికి చెందిన ప్రశాంత్ (30) ప్రస్తుతం రగుడు గ్రామంలో నివాసం ఉంటున్నాడు. తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మరిగడ్డ సమీపంలో బైక్ అదుపు తప్పడంతో కింద పడి పోయి యువకుడికి తీవ్ర రక్తస్రావమైంది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే 108 అత్యవసర సేవలకు సమాచారం అందించారు.